

శేషాద్రిపురం కళాశాలలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

7 నేటి నుంచి ద్వితీయ పీయూ పరీక్షలు



సాంస్కృతిక ప్రదర్శన



మంత్రి జమీర్

రాయల వైభవాన్ని చాటి చెప్పేందుకే..

● ఏటా హంపి ఉత్సవాల నిర్వహణ ● కళలు, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ ● జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్

బళ్లారి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయల వైభవాన్ని చాటి చెప్పేందుకే ఏటా హంపి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, ఉత్సవాలతో విజయనగర సామ్రాజ్య వైభవం కళ్ల ముందు సాక్షాత్కరిస్తుందని గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అన్నారు. జగత్‌ను తిలకించేందుకు ఇంద్రుడుకి వెయ్యికళ్లు, అలాగే విజయనగర రాజధాని అయిన హంపి వైభవాన్ని తిలకించేందుకు రెండు కళ్లు చాలవు, వెయ్యి కళ్లైనా కావాలని మంత్రి అన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న మూడు రోజుల హంపి ఉత్సవాలను తొలి రోజు అయిన శుక్రవారం ప్రధాన వేదికల్లో ఒకటైన ఎంపీ ప్రకాష్ వేదిక పై నుంచి మంత్రి ఘనంగా ప్రారంభించారు. ముందుగా భువనేశ్వరి అమ్మవారికి హంపి పీఠాధిపతి విద్యారణ్య సామీజీ పూజలు చేశారు. తర్వాత ఢమరుకం మోగించి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమానికి హొస్పేట్ ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప ఆధ్యక్షతన వహించారు. విజయనగర డీసీ ఎంఎస్ దివాకర్ ఉత్సవాల ఏర్పాటు పై మాట్లాడారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అమ్మద్ మాట్లాడారు. విజయనగర సామ్రాజ్యం అంటే దక్షిణ భారత దేశంలోనే అత్యంత పవిత్రస్థలం అని అలాగే శ్రీకృష్ణ దేవరాయులు కాలంలో ఇక్కడ వజ్రవైడుర్యాలు, కళాసంపద, తొణికిసలాడాయన్నారు. అనాటి వైభవాలు ఈ తరం వారికి కళ్లకు కట్టినట్లు చూపించాలనే ఉద్దేశంతో హంపి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవం అనేది మనిషిలో ఉత్సాహం నింపుతుందని అలాగే అనాటి వైభవాలు అలవాట్లు గుర్తుకు చేస్తాయన్నారు. కన్నడ మరియు సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడి మాట్లాడుతూ హంపి ఉత్సవాలు జరగడానికి అప్పటి నాయకుడు ఎంపీ ప్రకాష్ ప్రధాన కారణమన్నారు. ఉత్సవాల నిర్వహణకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. హంపి ఉత్సవం, అలాగే అనేగొంది ఉత్సవాలు శ్రీకృష్ణదేవరాయులు కాలాన్ని గుర్తు చేస్తాయన్నారు. ఉత్సవాల్లో కళాకారులను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తామన్నారు. ఎమ్మెల్యేలు గవియప్ప, నేమరాజ్ నాయక్, డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు కన్నడ హీరో రమేష్ అరవింద్, హీరోహిన్లు ప్రేమ, పూజగాంధీ మాట్లాడారు. ప్రజలకు అనాటి వైభవాలు గుర్తు చేస్తూ కళాసాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. వీరితో పాటు శ్రీకృష్ణదేవరాయుల వంశస్తులు లలిత, తదితరులు పాల్గొన్నారు. పలువురు విదేశీయులు సైతం ఉత్సవాల్లో పాల్గొన్నారు.



భువనేశ్వరి దేవికి పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న విద్యారణ్య స్వామీజీ





ముగ్గులను మొబైల్‌లో బంధిస్తున్న ఇటలీ మహిళ



శ్రీకృష్ణదేవరాయల విగ్రహం.. హంపి ఉత్సవాల లోగో

బెంగళూరు అభివృద్ధికి గ్రాంట్లు పెంచండి

● సీఎం సిద్దరామయ్యకు బీజేపీ నగర ఎమ్మెల్యేల వినతి

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు అభివృద్ధి దృష్ట్యా ఎమ్మెల్యేకు గ్రాంట్లు పెంచాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర కోరారు. శుక్రవారం సీఎం సిద్దరామయ్యను అధికారిక నివాసం కావేరిలో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు భేటీ అయ్యారు. బెంగళూరులో మౌలిక సదుపాయాలు పెంచాల్సి ఉందని, ఫ్లై ఓవర్లు, ఇతర నిర్మాణ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని వివరించారు. నమ్మ మెట్రో రైలు చార్జీలు తగ్గించాలని కోరారు. బెంగళూరు నగరాభివృద్ధికి రూ.6-8వేల కోట్లు గతంలో బడ్జెట్‌లో కేటాయించారని గుర్తు చేశారు. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, పార్కుల వాచ్‌మెన్‌లకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఎంపీలు పీసీ మోహన్, తేజస్వి సూర్య, ఎమ్మెల్యేలు విశ్వనాథ్, గోపాలయ్య, మునిరాజు, మునిరత్న, ఉదయ్ గరుడాచార్, కేసీ రామమూర్తి, రవిసుబ్రమణ్య, రఘు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో బీజేపీ నేతల బృందం





65 శాతం దాటని ఆర్థిక ప్రగతి

● వార్షిక బడ్జెట్ ముగింపునకు 30రోజులే గడువు ● పలు శాఖల్లో మందకొడిగా అభివృద్ధి ● గ్యారెంటీల దెబ్బతో ఖజానాకు గండి

బెంగళూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఢోకా లేదని సంక్షేమం, అభివృద్ధి ఉమ్మడిగా అమలు చేస్తున్నామని కీలక పాలకులు ఎంతగా గొప్పలుపోతున్నా ఆచరణలో అధ్వానంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. అధికార కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలు కనీస గ్రాంట్లు విడుదల కావడం లేదని నియోజకవర్గాలలో పర్యటించే పరిస్థితి లేకుండా పోతోందని తిరగబడేస్థాయికి చేరడంతో కొందరిని బుజ్జగించేందుకు గ్రామీణ ప్రాంతాల ఎమ్మెల్యేలకు రూ.10కోట్లు చొప్పున విడుదల చేసి అప్పటికప్పుడు నోరు మూయించారు. అయితే రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దారి తప్పుతోందని, ఇంకెంతకాలం గ్యారెంటీలతో ముందుకెళ్లగలమని సొంతపార్టీకి చెందిన సీనియర్ నేత బీకే హరిప్రసాద్ వ్యాఖ్యల తర్వాత హోం మంత్రి పరమేశ్వర్ కూడా అందరికీ ఉచితమంటే అసాధ్యమని, ఎవరికి అవసరమో వారికి మాత్రమే గ్యారెంటీలు సముచితం అనేలా వ్యాఖ్యానించారు. దీన్నిబట్టి త్వరలోనే బీపీఎల్ కార్డుదారులకు గ్యారెంటీలు వర్తింపచేసే విధానం తీసుకొస్తారనే ప్రచారం హల్‌చల్ చేస్తోంది. ఇప్పటికే రెండుసార్లు డీసీఎం డీకే శివకుమార్ కూడా గ్యారెంటీల విషయమై నోరు జారారు. అయితే దేశమంతటా కర్ణాటక ప్రభుత్వంవైపు చూస్తుండడాన్ని, ఇక్కడ గ్యారెంటీలు అమలు కావాల్సిందేనని, వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడరాదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హెచ్చరికలు చేయడంతో ఇటీవల గ్యారెంటీల ఊసెత్తేందుకు ఎవరూ ఉత్సాహం చూపడంలేదు.

ఆయా శాఖల్లో ప్రగతి

శాఖ	శాతం
పర్యాటకం	100
విద్యుత్	80.04
రవాణా	76.17
వైద్యవిద్య	72.87
పశుసంవర్ధక	72.70
చిన్ననీటి పారుదల	72
కన్నడ సంస్కృతి	71.78
న్యాయ	71
మౌలిక సదుపాయాలు	69.58
నగరాభివృద్ధి	68.53
ఉన్నత విద్య	68.26
వాణిజ్య పరిశ్రమలు	64
హోంశాఖ	64.21
స్త్రీ శిశుసంక్షేమ	62.63
అటవీ	61.10
కార్మిక	61
రెవెన్యూ	60.68
సహకార	60
సాంఘికసంక్షేమం	60
ప్రాథమికవిద్య	60
ప్రజాపనులు	60

అంత సులువేమీ కాదు. అటువంటిది రాష్ట్ర ప్రభుత్వం ఐదు గ్యారెంటీలను అమలు చేస్తోంది. ఐదు గ్యారెంటీలకోసం ఏకంగా 56వేల కోట్ల రూపాయలు ఏడాదికి ఖర్చు చేస్తున్నారు. ఆదాయం అనుకున్నంత సాధ్యం కాకపోవడం, గ్యారెంటీల భారం పెరగడంతో ప్రగతి కుంటుపడుతోంది. గ్యారెంటీలతో సంబంధం లేకుండానే అభివృద్ధికి గ్రాంట్లు ఖర్చు చేస్తున్నామని సీఎం సిద్దరామయ్య పదే పదే అభిప్రాయ పడుతున్నారు. ప్రతిపక్షాలు మాత్రం రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందని ఆరోపిస్తున్నాయి. ఐదు గ్యారెంటీలలో యువనిధి మినహా మిగిలిన నాలుగు పథకాలకు భారీగా ఖర్చు చేశారు. ఆ నాలుగు గ్యారెంటీల ద్వారా సంబంధితశాఖలు ఆర్థిక ప్రగతిలోనూ దూసుకెళ్తున్నాయి. కేడీపీ ప్రగతి గణాంకాల ప్రకారం పది నెలల్లో శాఖలవారీగా 62శాతం మాత్రమే ఖర్చు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3,22,042 కోట్ల రూపాయలు గ్రాంట్లు కేటాయించారు. ఇందులో జనవరి వరకు 2,21,297 కోట్లు విడుదల చేశారు. ఇందులో 1,99,931 కోట్ల రూపాయలు ఖర్చు సాధ్యమైంది. దీని ప్రకారం 62శాతం ప్రగతి సాధ్యమైనట్లు అయ్యింది.

గతేడాది కన్నా మరింత దిగువకు..

గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఇదే వ్యవధికి పోల్చితే శాఖలవారీగా ఆర్థిక ప్రగతి తగ్గుముఖం పట్టింది. 2023-24 సంవత్సరంలో 73.19శాతం ఆర్థిక ప్రగతి సాధ్యమైంది. అప్పట్లో 2,73,194 కోట్లు విడుదల చేశారు. ఇందులో 2,16,427 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో శాఖలవారీగా ప్రగతి 11శాతం తగ్గుముఖం పట్టింది. మరో రెండు నెలల్లో 38శాతం ఆర్థిక ప్రగతి సాధ్యం కానుందా..? అనేది ప్రశ్నార్థకం అవుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మరో వారం రోజుల్లో సీఎం సిద్దరామయ్య ఆర్థికమంత్రి హోదాలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. కనీసం ఈ బడ్జెట్‌నైనా లక్ష్యం నెరవేరుతాందా లేదా వేచి చూడాలి.

జలవనరులకే అధిక ప్రాధాన్యం

అయితే రాష్ట్రంలో 2024-25 బడ్జెట్ ప్రకారం పరిశీలిస్తే 62శాతం మాత్రమే ఆర్థిక ప్రగతి సాధ్యమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రైతు సంక్షేమానికి, జలవనరుల విభాగానికి ప్రాధాన్యం ఇస్తామని అందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గొప్పలు చెప్పుకొంటున్నా ఆచరణలో రెండు విభాగాల ప్రగతి అధ్వానంగా ఉంది. సాధారణంగా ఆర్థిక సంవత్సరం కోసం ప్రవేశపెట్టే అంచనాల బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో అమలు చే యడం సాధ్యం కాదు. అందుకు పలు కారణాలు ఉంటాయి. పన్నులు, కేంద్రప్రభుత్వ గ్రాంట్లతోపాటు ఇతరత్రా ఆదాయలు అనుకున్న లక్ష్యాన్ని చేరడం

55శాతం కంటే తక్కువ ప్రగతి

బీసీ సంక్షేమ	53
నైపుణ్యాభివృద్ధి	53
వసతి	52.76
మైనారిటీ సంక్షేమం	52
వ్యవసాయం	51.57
క్రీడలు	49
జలవనరులు	48.46
పౌర ఆహార సరఫరాలు	48.21
గ్రామీణాభివృద్ధి	45.32
ఎస్టీ సంక్షేమం	39
మత్స్యశాఖ	33
ఐటీబీటీ	14.47

శాఖలవారీ గ్రాంట్ల వివరాలు రూ.కోట్లలో..

శాఖ	కేటాయింపు	విడుదల	ఖర్చు	ప్రగతిశాతం
ఆహార	9,976	4,993	4,810	48.21
రవాణా	6,535	5,050	4,978	76.17
నగరాభివృద్ధి	19,714	1,0487	13,511	68.53
హోం	12,831	11,375	8,239	64.21
స్త్రీ శిశుసంక్షేమ	34,406	22,465	21,550	63.63
రెవెన్యూ	3053	2833	1853	60.68
వ్యవసాయ	5148	2901	2655	51.57
జలవనరులు	16832	9627	8156	48.46

22న రాష్ట్ర బంద్

● కేఎస్‌ఆర్టీసీ సిబ్బందిపై మరాఠాల వేధింపులను సహించం ● కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్



మీడియాతో మాట్లాడుతున్న వాటాళ్ నాగరాజ్

బెంగళూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో కేఎస్‌ఆర్టీసీ సిబ్బందిపై దాడి, బస్సులకు రంగులు వేయడంతోపాటు బెళగావిలో మరాఠీ మాట్లాడలేదని కండక్టర్‌పై దాడిని ఖండిస్తూ మార్చి 22న రాష్ట్రబంద్‌కు కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కన్నడ సంఘాల ముఖ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాటాళ్ నాగరాజ్ మీడియాతో మాట్లాడుతూ కర్ణాటకలోనే కన్నడిగులను వేధించడం, మహారాష్ట్రకు వెళ్లే బస్సులు, సిబ్బందిపై దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. మార్చి 7న బెళగావి ఛలో జరుపుతున్నామని, 11వ తేదీ మేకెదాటు ప్రాజెక్టు అమలు చేస్తూ అత్తిబెలె సరిహద్దును బంద్ చేస్తామన్నారు. 16న హొస్కోటె టోల్ బంద్ చేస్తామని, 22వ తేదీన కర్ణాటక బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. బెంగళూరులో భారీ ర్యాలీ నిర్వహించేందుకు తీర్మానించామన్నారు. టౌన్‌హాల్ నుంచి ఫ్రీడంపార్కు దాకా ర్యాలీ కొనసాగుతుందన్నారు. అన్ని ప్రజాసంఘాలు, కార్మికసంఘాలను ఆహ్వానించామని, అందరూ మద్దతు తెలిపారన్నారు. ముఖ్యనాయకులు ప్రవీణ్‌శెట్టి, సా.రా. గోవిందు, కేసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కర్ణాటక రక్షణా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ స్పందిస్తూ రాష్ట్ర బంద్‌కు తమ మద్దతు లేదని ప్రకటించారు.

ప్యాలెస్ మైదానం టీడీఆర్ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి షాక్

● వారం రోజుల్లో రూ.3,400 డిపాజిట్ చేయాలి ● సుప్రీంకోర్టు కీలక ఆదేశం

బెంగళూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్యాలెస్ మైదానం భూ వివాదానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. ఇటీవల జారీ చేసిన ఆర్డినెన్స్‌ను అంగీకరించని సుప్రీంకోర్టు రూ.3,400 కోట్లు ట్రాన్స్‌ఫరబుల్ డెవలెప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) రూపంలో వారం రోజుల్లోగా డిపాజిట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వతీరును న్యాయమూర్తులు ఎంఎం సుందరేశ్, అరవింద్‌కుమార్‌ల ధర్మాసనం తప్పుబట్టింది. ప్రభుత్వ నిర్ణయం ఎప్పటికప్పుడు మార్చుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం న్యాయ ఉల్లంఘన పిటిషన్ విచారణ వేళ ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్, బీడీఏ కమిషనర్ జయరాం పాల్గొన్నారు. ప్రభుత్వం, అధికారుల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, రాజీవ్‌ధావన్‌లు వాదనలు వినిపించారు. మైసూరు రాజసంస్థానం తరపున న్యాయవాదులు ఏకే గంగూలీ, రాకేశ్ ద్వివేది, మాధవి దివాన్, గోపాల్ శంకరనారాయణ్‌లు వాదనలు వినిపించారు. బళ్ళారి రోడ్డు, జయమహల్‌రోడ్ల విస్తరణకు 15.7 ఎకరాల భూమికోసం వివాదం సాగుతోంది.

శాసనసభ సమావేశాలకు గవర్నర్‌కు ఆహ్వానం 7 | రిటైర్డు ఉద్యోగుల భారీ నిరసన 7 | వైభవంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం

రేపటి నుంచి దాదులూరు పరుష


పోతలయ్యస్వామి మూలవిరాట్

కనగానపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారమైన దాదులూరు పోతలయ్య స్వామి పరుష ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పరుష సందర్భంగా పోతలయ్య, చెన్నకేశవ, బంగారు లింగమయ్య స్వాములను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఈ పరుషకు మన రాష్ట్రం నుంచే కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ఆదివారం కలికివాండ్లపల్లి బిజారీ వంశీయులు ఎలవగంప తీసుకురావడంతో జాతర ప్రారంభమవుతుంది. రెండో రోజు జ్యోతులు, బోనాలు, ఫలహారపు బండ్లతో ఆలయ ప్రదక్షిణలు చేసి ముక్కులు తీర్చుకుంటారు. జాతరలో ప్రదానఘట్టమైన గావుల మహోత్సవం మంగళవారం తెల్లవారుజామునే జరగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

నైతిక విలువలతోనే జీవితానికి సార్థకత

● పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా


మాట్లాడుతున్న ఉమర్ అలీషా

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నైతిక విలువలు, క్రమశిక్షణ అలవరుచుకుంటేనే జీవితానికి సార్థకత చేకూరుతుందని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా పేర్కొన్నారు. డాక్టర్ ఉమర్ అలీషా సాహితీ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక లలితకళా పరిషత్ లో 'భారతదేశం-మత సామరస్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆకాశవాణి సీనియర్ వ్యాఖ్యాత జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ ఉమర్ అలీషా ముఖ్యఅతిథిగా హాజరై సందేశమిచ్చారు. మతం ఏదైనా మానవత్వమే బోధిస్తుందన్నారు. మానవసేవే మాధవసేవగా భావించి ఆధ్యాత్మిక చింతనతో సేవామార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. మానవ మేధస్సును విధ్వంసం కోసం కాకుండా సమాజ వికాసం, ఉత్తమ మానవ జీవనంకోసం ఉపయోగించాలన్నారు. ఆ దిశగా ఎంతోమంది మహనీయులు సమాజ చైతన్యంకోసం కృషి చేశారనీ, వారిలో కవిశేఖరుడు డాక్టర్ ఉమర్ అలీషా విజ్ఞానవంతమైన సమాజ సృష్టికి తోడ్పడ్డారని తెలిపారు. విద్యార్థులందరినీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, లలితకళాపరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, రచయితలు డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, దాయన చంద్రజీ, ద్విభాషా కవి జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, మురళీకృష్ణ, నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి పాల్గొన్నారు.

3 నుంచి పారా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 4వ పారా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఈనెల మూడు నుంచి అశోక్ నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించనున్నట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లు శుక్రవారం స్థానిక దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో ఏడీ వినోద్‌కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఏడీ తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు ఆధార్‌కార్డు, క్రీడా సామగ్రి, యూనిఫాంతో ఇండోర్‌స్టేడియంలో హాజరుకావాలని కోరారు. విజేతలైన క్రీడాకారులు మార్చి 16 నుంచి ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో నిర్వహించే జాతీయస్థాయి పారా వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9390388169, 8074106154ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి పశువులకు టీకా కార్యక్రమం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రామచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో విడత ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని మార్చి నెలాఖరుదాకా నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని 349800 పశువులకు టీకా వేస్తామన్నారు. 9500 పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకా వేస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబేడ్కర్ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో చేరగోరు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగజ్యోతి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. 2025-26 సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోర్సు ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుందన్నారు. కళాశాలలో ఎంపీసీ 80సీట్లు, బైపీసీ 80సీట్లు ఉన్నాయన్నారు. మార్చి ఆరో తేదీలోపు అర్హులైనవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్ సైట్ : apcfss.in నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ ఆరో తేదీ మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4:30గంటల వరకు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9573582804, 9490363701 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పోండి.. ఇక్కన్నుంచి..!

- నీలం సంజీవరెడ్డి స్టేడియంలోకి రావద్దు
- క్రీడాకారులను బయటకు పంపుతున్న పోలీసులు
- స్పోర్ట్స్ ప్రాక్టీస్, కోచింగ్‌కు నిరాకరణ
- ఆందోళనలో కోచ్‌లు, క్రీడాకారులు
- శాప్, కలెక్టర్ వద్దకు చేరిన పంచాయితీ



పీటీసీ స్టేడియం గేటుకు నిబంధనల ఫ్లెక్సీ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకే తలమానికంగా నిలిచిన స్థానిక నీలం సంజీవరెడ్డి పోలీసు శిక్షణ కళాశాల (పీటీసీ) స్టేడియంపై ప్రస్తుతం రచ్చ జరుగుతోంది. స్టేడియంలోకి క్రీడాకారులను, శిక్షకులను అనుమతించడంలేదు. పోలీసుల తీరుతో ఈ స్టేడియం ఎవరిదన్న చర్చ తెరపైకి వచ్చింది. 1964లో అప్పటి స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రూ.1.77 లక్షల నిధులతో నీలం సంజీవరెడ్డి పేరుతో స్టేడియం నిర్మించారు. అప్పటికే ఇక్కడ పోలీసు శిక్షణ కళాశాల ఉంది. దీంతో స్టేడియాన్ని పీటీసీకి స్వాధీనం చేశారు. ఇక అప్పటి నుంచి పీటీసీ ఆధ్వర్యంలోనే స్టేడియం నిర్వహిస్తున్నారు. తాజాగా క్రీడాప్రాక్టీస్, శిక్షణతోపాటు పోటీలకు అనుమతి లేదంటూ పీటీసీ అధికారులు ప్రకటించారు. దీంతో క్రీడాకారులు, కోచ్‌లు ఆందోళనలో పడ్డారు. స్టేడియంలో క్రికెట్, వాలీబాల్,ఇతర క్రీడా కోచింగ్, ప్రాక్టీస్ సమయాల్లో బెట్టింగ్‌కు పాల్పడుతూ... క్రీడాకారులు ఘర్షణలకు దిగుతున్నారనే ఆరోపణల తోనే అనుమతి ఇవ్వడం లేదని పీటీసీ అధికారులు చెప్పుకొస్తున్నారు. 30 ఏళ్లుగా ఒకే వ్యక్తి క్రికెట్ కోచింగ్ పేరుతో క్రికెటర్ల నుంచి లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ... వారితోనే తన స్పోర్ట్స్ షాపులో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. పీటీసీ మొత్తం సుమారు 50ఎకరాల్లో నగర నడిబొడ్డున ఉంది. ప్రస్తుతం నగరం అభివృద్ధి, విస్తరణతో పీటీసీని శివారులోకి మారుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో పీటీసీలో క్రీడలు, కోచింగ్, ప్రాక్టీస్‌కు అనుమతిస్తారా, లేదా అన్నదానిపై స్పష్టత లేదు. పైగా పీటీసీ పంచాయితీ.. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఉన్నతాధికారులు, కలెక్టర్ వద్దకు చేరింది. ఎలాంటి పరిష్కారం చూపుతారో వేచిచూడాల్సిందే.

బెట్టింగ్ సాకు..

నీలం సంజీవరెడ్డి స్టేడియంలో 30 ఏళ్లుగా క్రికెట్ తదితర క్రీడల కోచింగ్, నెట్‌ప్రాక్టీస్ సాగుతోంది. ఒకే వ్యక్తి ఇక్కడ క్రికెట్ కోచింగ్ ఇస్తున్నారు. నెట్ ప్రాక్టీస్ సందర్భంగా జరిగిన బెట్టింగ్‌లు, ఘర్షణలను సాకుగా తీసుకుని స్టేడియంను పోలీసులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఉచిత కోచింగ్ పేరుతో క్రీడాకారుల


యంత్రంతో క్రీడా శిక్షణ ఏర్పాట్ల తొలగింపు

నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేయడం, కోచ్‌కు సంబంధించి స్పోర్ట్స్ షాపులో క్రీడాకారులతో పనులు చేయించుకోవడం వివాదాస్పదమైంది. ఆ కోచ్ గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధిగా సైతం ఎన్నికయ్యారు. అప్పట్లో అధికారం అండతో హవా కొనసాగించారు. జిల్లా జట్టుకు క్రికెటర్ల ఎంపికలోనూ తన వద్ద శిక్షణ తీసుకున్న వారికే అవకాశం ఇవ్వాలని డిమాండ్లు పెట్టినట్లు చర్చకు వచ్చాయి. క్రికెట్ కోచింగ్, నెట్ ప్రాక్టీస్ సమయంలో బెట్టింగ్ ఆడుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇదే సాకుతోనే స్టేడియంలోకి క్రీడలు, క్రీడాకారులకు కోచింగ్‌కు అనుమతి ఇవ్వకూడదని పీటీసీ అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఎవరో చేసిన తప్పుకు మొత్తం క్రీడాకారులను బలిపెట్టడం ఏమిటనే విమర్శ వస్తోంది. బెట్టింగ్, ఇతర తప్పిదాలు ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, ఇలా స్టేడియంలోకి రానివ్వకపోవడం సరికాదని నగర ప్రజలు అంటున్నారు.

ఎవరిదో..?

నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియం ఎవరి ఆధ్వర్యంలో ఉంది, ఇందులో క్రీడలకు ఎవరెవరికి అనుమతి ఉంటుంది అనే అంశంపై తీవ్ర చర్చ సాగుతోంది. 1964లో అప్పటి ఏపీ స్పోర్ట్స్ కౌన్సిల్ పీటీసీలో


నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియం

రూ.1.77 లక్షల నిధులతో స్టేడియం నిర్మించింది. ఇందులో ఏపీ స్పోర్ట్స్ కౌన్సిల్ రూ.50వేలు, కేంద్రప్రభుత్వం రూ.25వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.50వేలు, ఇతర నిధులు రూ.52,395 ఉన్నాయి. తర్వాతి కాలంలో స్పోర్ట్స్ కౌన్సిల్ కాస్తా... శాప్‌గా రూపాంతరం చెందింది. పీటీసీ స్టేడియం పూర్తిగా పోలీసుల కంట్రోల్‌లోకి వెళ్లింది.

శాప్, కలెక్టర్ వద్దకు పంచాయితీ

పీటీసీ స్టేడియంలో క్రీడలు, శిక్షణకు అనుమతించకపోవడంపై క్రీడాకారులు, కోచ్‌లు.. ఇటీవల జిల్లాలో పర్యటించిన శాప్ చైర్మన్ రవినాయుడు దృష్టికి తీసుకొచ్చారు. శాప్ చైర్మన్ సూచన మేరకు జిల్లా కలెక్టర్, శాప్ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా నివేదికను డీఎస్‌డీఓ పంపారు. అటు శాప్, ఇటు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని పీటీసీ స్టేడియంలోకి క్రీడాకారులను కోచింగ్, ప్రాక్టీస్‌కు అనుమతిస్తారా, ప్రత్యామ్నాయం చూపిస్తారా అన్నదానిపై స్పష్టత లేదు.

పీటీసీని తరలిస్తారా?

నగరానికి దూరంగా 60 ఏళ్ల క్రితం పీటీసీని నిర్మించారు. నగరం అభివృద్ధి చెందడంతో నడిబొడ్డుకు చేరింది. ఈ నేపథ్యంలో మంచి వాతావరణం, స్వచ్ఛమైన గాలి, వెలుతురు కోసం పీటీసీని నగర శివారు ప్రాంతానికి మారుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అదే జరిగితే.. ఆ ప్రాంతం మొత్తం క్రీడాశాఖకు అప్పగించి, నీలం సంజీవరెడ్డి స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేసి ఆధునిక హంగులతో అందుబాటులోకి తీసుకువస్తారా అనే చర్చ సాగుతోంది.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం



పీటీసీ స్టేడియం.. ఎన్నో క్రీడా పోటీలకు వేదికగా నిలిచింది. ప్రస్తుతం కోచింగ్, క్రీడా పోటీల నిర్వహణకు పీటీసీ అధికారులు అనుమతించట్లేదు. ఈ నేపథ్యంలో స్టేడియంపై కలెక్టర్‌కు పూర్తి వివరాలతో నివేదిక పంపాం.

- ఉదయ్‌భాస్కర్, డీఎస్‌డీఓ

రక్షణ కవర్లతో ప్రయోజనం

- జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు


రక్షణ కవర్ల ఉపయోగం రైతులకు వివరిస్తున్న ఉద్యాన శాఖ అధికారి

గార్లదిన్నె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రక్షణ కవర్ల(ఫ్రూట్ కేర్ ఆక్టివిటిస్)తో మామిడి పండ్ల కు ఎంతో ప్రయోజనం కలుగుతుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామంలో రైతు ఆనంద్‌రెడ్డి మామిడి తోటలో మామిడి పండ్ల రక్షణ కవర్లపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి సాగులో క్రిమి సంహారక మందులు, కూలీలకు ఎక్కువ ఖర్చు రావడంతో పాటు గిట్టుబాటు ధర లేక రైతులు గత కొన్నేళ్లుగా నష్టపోతున్నారన్నారు. అందుకే మామిడి రైతుల కోసం ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో మామిడి పండ్ల రక్షణ కవర్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కవర్ల వినియోగం ద్వారా పండ్లపై మంగు, మచ్చలు రావన్నారు. పురుగు, ఈగల బాధ లేకుండా కాయలు నాణ్యంగా ఉంటాయన్నారు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్, హెచ్ఈఓ రామాంజనేయులు, వీహెచ్‌ఏలు గుల్‌ఫరేష, గంపరాజులు, మల్లికార్జున, లలిత, రధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

11 వేలు దాటిన సెల్ ఫోన్ల రికవరీ

- జిల్లా ఎస్పీ చేతులమీదుగా 1183 ఫోన్లు అందజేత


మహిళకు మొబైల్ అందజేస్తున్న జిల్లా ఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ల రికవరీలో 11వేల మైలురాయిని జిల్లా పోలీసులు దాటారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ జగదీష్ చేతులమీదుగా రూ.2.95కోట్ల విలువ చేసే 1183 ఫోన్లను బాధితులకు శుక్రవారం అందజేశారు. 2022 జూన్ 26న జిల్లా పోలీస్ శాఖ చాట్‌బాట్ సేవలు ప్రారంభించి చోరీకి గురైన లేదా మిస్సయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ప్రజలకు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు రికవరీ చేసి అందజేసిన ఫోన్ల సంఖ్య 11378కి చేరింది. ఇందులో 20 రాష్ట్రాలలోని బాధితులకు ముట్టజెప్పిన ఫోన్లు 1174. అనంతపురం జిల్లాకు చెందిన వారివి 7512. 19 జిల్లాల బాధితులకు అందజేసినవి 2692 ఫోన్లు. రికవరీ చేసి అందజేసిన ఫోన్లలో రూ.499ల నుంచి రూ.1.41లక్షల విలువైనవి ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ల రికవరీలో దేశంలోనే అనంత పోలీసులు అగ్రస్థానంలో నిలిచారన్నారు. ఫోన్ చోరీకి గురైనా మిస్ అయినా చాట్ బాట్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీఈఐఆర్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

రామగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలికివాండ్లపల్లి గ్రామ సమీపంలోని మరువ వంకలో చేపలు పట్టడానికి వెళ్లి శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు...బుక్కపట్నం గ్రామానికి చెందిన కొందరు సంచారజాతుల వారు నాలుగు రోజుల కిందట కుంటిమద్ది సమీపంలో గుడిసెలు వేసుకున్నారు. ఆ జాతికి చెందిన సాకే వెంకటేశులు (59)కలికివాండ్లపల్లి సమీపంలోని వంక వద్దకు చేపలు పట్టడానికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు లోతైనా గుంతలోకి జారి పడ్డాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. స్థానికులు గమనించి అతడిని బయటకు తీసి, పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఆయన బంధువులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైకు బోల్తా.. రైతు మృతి

రామగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటిమద్ది గ్రామానికి చెందిన రైతు బోయచంద్రాయుడు(33) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు...కుంటిమద్ది గ్రామానికి చెందిన అగ్రహారం సూర్యనారాయణ చిన్న కుమారుడు బోయ చంద్రాయుడు శ్రీహరిపురం సమీపంలోని తన తోట వద్దకు వెళ్లి గురువారం రాత్రి ద్విచక్రవాహనంలో తిరిగి ఇంటికి బయల్దేరాడు. శ్రీహరిపురం మలుపు వద్ద కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి బైకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చంద్రాయుడు తీవ్రంగా గాయపడగా స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రేపు జిల్లా రిజిస్ట్రార్ వివాహం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి) : స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్(డీఆర్) భార్గవ్ ఓ ఇంటివాడు కాబోతున్నారు. ఈనెల రెండో తేదీన ఆయన వివాహం కడప నగరంలో జరగనుంది. ప్రత్యేక శిక్షణ కోసం వారం రోజుల పాటు ఢిల్లీకి వెళ్లిన డీఆర్ పెళ్లి సందర్భంగా సెలవు పెట్టారు. 20వతేదీ వరకు డీఆర్ సెలవులో ఉండనున్నారు. అప్పటివరకు ఇన్‌చార్జ్ డీఆర్‌గా డీఐజీ విజయలక్ష్మి బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

ఇమామ్‌లు, మౌజన్లకు వేతనాలు అందజేయండి

మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలోని మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లు, మౌజన్లకు వేతనాలు అందజేయాలని మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి.. ముతవల్లీలను ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశా రు. ముతవల్లీలు ఆయా మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లు, మౌజన్లకు వేతనాలకు సంబంధించిన చెక్కులను అందజేయాలన్నారు. జిల్లాలో పలు మసీదులకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు యాజమాన్యాలు అందజేయలేదన్నారు. పత్రాలు అందించకపోతే ఆయా మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనాలు అందవన్నారు. 15 రోజుల్లోపు రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాలను అందజేయాలన్నారు. వివరాలకు 9966647586, 9032557006 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్

క్షేత్రస్థాయి విధుల్లోకి 395 మంది ఎస్ఐలు... హాజరు కానున్న హోంశాఖ మంత్రి, డీజీపీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అనంతపురం పోలీస్ శిక్షణా కళాశాల పరేడ్ మైదానంలో శనివారం ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్ జరగనుంది. మొత్తం 395 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లుగా 9 నెలల శిక్షణను పూర్తి చేసుకుని, క్షేత్రస్థాయి విధులకు వెళుతున్నారు. కార్యక్రమానికి హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా హాజరు అవుతున్నారు. పరేడ్ ఉదయం 8.30 గంటలకు ప్రారంభమై 11.30 గంటలకు ముగుస్తుంది. అనంతరం డీపీఓలో కమాండ్ కంట్రోల్ నూతన భవన నిర్మాణానికి హోం మంత్రి భూమి పూజ చేస్తారు. పోలీస్ సంక్షేమ కార్యక్రమాల అమలును పరిశీలిస్తారు. అనంతరం తిరుగుపయనమౌతారు. మొత్తం 395 మందిలో ఎస్ఐలలో సివిల్ ఎస్ఐలు 300 మంది ఉన్నారు. వీరిలో మహిళలు 97 మంది, పురుషులు 203 మంది. మిగిలిన 95 మందిలో ఏపీఎస్పీ ఎస్ఐలు 94 మంది, ఒకరు ఏఆర్ ఎస్ఐ ఉన్నారు. వీరందరూ పురుషులే. డీజీపీ శుక్రవారం రాత్రి 9గంటలకు అనంతపురం చేరుకున్నారు. హోం మంత్రి అర్ధరాత్రి నగరానికి చేరుకుంటారు.

చీనీ కాయలు టన్ను రూ.21వేలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21,110, కనిష్ఠంగా రూ.6,200, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 74 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.10

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8 కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి : ఎమ్మెల్యే

సిరుగుప్ప, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు కాంట్రాక్టర్లకు సూచించారు. శుక్రవారం కేసూగూరు గ్రామంలో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూ మిపూజ చేశారు. కేకేఆర్డీపీ నిధుల కింద పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఇంజనీర్లు, ఏఈఈ తిప్పేస్వామి, కాం ట్రాక్టర్లు పాల్గొన్నారు.


భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

వైద్య విద్యకు న్యాయం జోడించాలి

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

విజయవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులకు న్యాయ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. దీనిపై వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఆలోచించాలని సూచించారు. విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల 2019 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో వైద్యులకు, న్యాయవాదులకు ఎంతో బాధ్యత ఉందని గుర్తు చేశారు. రోగికి, వైద్యులకు సంయమనం ఉండాలని చెప్పారు. ఓపికతో రోగుల సమస్యలు వింటే సగం చికిత్స చేసినట్టేనని అన్నారు. కొవిడ్‌లో 760 మంది వైద్యులు రోగులకు సేవలందించి ప్రాణాలర్పించారని, అటువంటి వైద్యులపై దాడులు ఎందుకు జరుగుతున్నాయో ఆలోచించుకోవాలని చెప్పారు. కమర్షియల్‌గా ఆలోచించే వైద్యులు ఎక్కువగా ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

ప్రస్తుతం సామాన్యుడికి వైద్యం అందడం గగనంగా మారిందని, ఆరోగ్య వ్యవస్థంతా కార్పొరేట్ రంగంలోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు, కార్పొరేట్ ఆస్పత్రుల నీడపడని ప్రాంతాలు దేశంలో చాలా ఉన్నాయని చెప్పారు. ఈ ప్రాంతాల్లో పనిచేస్తే వైద్యులు సమాజానికి మంచి సేవ చేసిన వారవుతారన్నారని సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదివే వారికి సామాజిక బాధ్యత ఎక్కువగా ఉండాలన్నారు. ప్రజలు చెల్లించిన పన్నులతో విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి : మాజీ ఎమ్మెల్యే

సిరుగుప్ప, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యాప్రగతికి విద్యార్థులు ముందడుగు వేయాలని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప పిలుపునిచ్చారు. తాలుకాలోని టెక్కలకోట పట్టణం ప్రభుత్వ హైస్కూలులో వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలు సమీపిస్తుండటంతో చక్కగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థులు ఫలితాలు సాధించినప్పుడే ఉత్తమ భవిష్యత్తు లభిస్తుందని ఆయన తెలిపారు. హైస్కూలును అప్‌గ్రేడ్ చేయాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణ పంచాయతీ అధ్యక్షులు ఆనంద్, ముఖ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.


ద్విచక్ర వాహనాల ఢీ.. దంపతులకు గాయాలు

గార్లదిన్నె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలగాసిపల్లి జంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. కనుంపల్లికి చెందిన మనోహర్, లక్ష్మీనారాయణమ్మ దంపతులు గార్లదిన్నె నుంచి కనుంపల్లికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా తలగాసిపల్లి జంక్షన్ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచ్రవాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో భార్య, భర్తలు గాయపడ్డారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఎంకే త్యాగరాజ భాగవతార్ (జయంతి)



తమిళ సినిమారంగంలో తొలి సూపర్‌స్టార్‌గా పేరొందిన మాయవరం కృష్ణమూర్తి (ఎంకే) త్యాగరాజ భాగవతార్ 1910 మార్చి 1న తంజావూరు జిల్లా మాయవరం ప్రాంతంలో జన్మించారు. నటుడు, నిర్మాతగానే కాకుండా కర్ణాటక సంగీత గాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రత్యేకించి భక్తిగీతాలను స్వర పరచడంలోనూ నిష్ణాతులు. 1944లో విడుదలైన 'హరిదాస్' సినిమా మద్రాస్ బ్రాడ్‌వే థియేటర్‌లో వరుసగా మూడేళ్లపాటు ప్రద ర్శించబడి రికార్డుకెక్కింది. రెండో ప్రపంచయుద్ధ సమ యాన అప్పటి బ్రిటీష్ గవర్నర్ కోరిక మేరకు పలు కచేరీలు నిర్వహించారు. 1959 నవంబరు 1న కన్నుమూశారు.

ఆర్‌పీ గోయెంకా (జయంతి)




రామ ప్రసాద్ గోయెంకా 1930 మార్చి 1న కోల్‌కతాలో జన్మించారు. ఆర్‌పీజీ గ్రూప్ సంస్థ సంస్థాపకులు, ఛైర్మన్. ఇంటర్నేషనల్ మేనేజిమెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. రాజీవ్‌గాంధీ ఫౌండేషన్, ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్టుకు సభ్యుడిగా, ఫిక్కీ అధ్యక్షుడిగా, ఐఐటీ ఖరగ్‌పూర్‌కు ఛైర్మన్‌గా, టీటీడీ సభ్యుడిగా వ్యవహరించారు. రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. ఎంపెరర్ ఆఫ్ జపాన్ నుంచి 'ఆర్డర్ ఆఫ్ ది సాక్రెడ్ ట్రెజర్' పురస్కారాన్ని రెండుసార్లు అందుకున్నారు. 2013 ఏప్రిల్ 14న కన్నుమూశారు.

నితీష్ కుమార్ (పుట్టినరోజు)



బీహార్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం కొనసాగిన నితీష్ కుమార్ 1951 మార్చి 1న బీహార్ రాష్ట్రం బక్తియార్‌పూర్‌లో జన్మించారు. కేంద్రంలో రైల్వే, రవాణా, వ్యవసాయం తదితరశాఖలను పర్యవేక్షించిన ఘనత ఉంది. ప్రధానంగా రైల్వేలో తత్కాల్ స్కీమ్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది. జనతాదళ్ (యునైటెడ్) పార్టీలో కీలక నేత. ముఖ్యమంత్రిగా లక్షమంది ఉపాధ్యాయులను నియమించారు. బాలికా విద్యను ప్రోత్సహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులను నియమించారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేశారు. మద్యపాన నిషేధం విధించారు. నిరక్షరాస్యతను తగ్గించడం ద్వారా నేరాల సంఖ్య కూడా తగ్గేలా చేశారు. బీహార్ రాష్ట్ర సగటు ఆదాయం పెంచేలా ఎంతో కృషి చేశారు. పలు గౌరవాలు అందుకున్నారు.

ఎంకే స్టాలిన్ (పుట్టినరోజు)



తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి, డీఎంకే పార్టీ అధ్యక్షుడు ముత్తువేల్ కరుణానిధి (ఎంకే) స్టాలిన్ 1953 మార్చి 1న మద్రాస్‌లో జన్మించారు. తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి కుమారుడు. 2009-11 మధ్య తమిళనాడు ఉపముఖ్యమంత్రిగా వ్యవహరించారు. 2021లో పెరియార్ జయంతిని సామాజిక న్యాయ దినోత్సవంగా ప్రకటించారు. డీఎంకే యువవిభాగం ఏర్పాటు చేసి సుదీర్ఘకాలం సెక్రటరీగా కొనసాగారు. 1996లో చెన్నై మేయర్‌గా ఎన్నికయ్యారు. చెన్నైలో 9 ఫ్లైవర్‌లతో అభివృద్ధి చేశారు. 2022లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకటించిన మోస్ట్ పవర్‌ఫుల్ పర్సనాలిటీలలో 24వ స్థానంలో నిలిచారు.

డెనిస్ ముక్వేగి (పుట్టినరోజు)




నోబెల్ శాంతి పురస్కార గ్రహీతలలో ఒకరైన డెనిస్ ముక్వేగి 1955 మార్చి 1న జన్మించారు. కాంగో దేశంలో పేరొందిన గైనకాలజిస్ట్, పెంతెకోస్తు పాస్టర్. బుకావులో పాన్జీ హాస్పిటల్ స్థాపించి సాయుధ విప్లవకారుల దాడికి గురైన మహిళలకు చికిత్సలు అందిస్తున్నారు. రెండో కాంగో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అత్యాచార బాధితులైన వేలాదిమంది మహిళలకు చికిత్స అందించారు. ముక్వేగి, నదియా మురాద్‌లకు నోబెల్ శాంతి బహుమతిని సంయుక్తంగా ప్రదానం చేశారు. చాంపియన్ పీస్ అవార్డ్, సియోల్ పీస్ ప్రైజ్, యూఎన్ హ్యూమన్ రైట్స్ ప్రైజ్, 2024లో అరోర ప్రైజ్, ఇతర పురస్కారాలు, గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు.

షాహిద్ అఫ్రిది (పుట్టినరోజు)



పాకిస్థాన్‌కు చెందిన క్రికెటర్ సాహిబ్జాదా మొహమ్మద్ షాహిద్ ఖాన్ అఫ్రిది 1975 మార్చి 1న జన్మించారు. పాకిస్థానీ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఆల్‌రౌండర్ ప్రతిభ కలిగినవారు. ఫాస్టెస్ట్ వన్డే సెంచరీలోనూ, వన్డేలలో అత్యధిక సిక్సులు కొట్టి తనదైన రికార్డు నెలకొల్పారు. సొంతంగా ఫౌండేషన్ ఏర్పాటు చేసి విద్య, ఆరోగ్యంకోసం కృషి చేస్తున్నారు. యునిసెఫ్‌తోపాటు పలు స్వచ్ఛంద సంస్థలతో కలసి పోలియో నివారణకోసం రాయబారిగా వ్యవహరించారు.

మేరీ కోమ్ (పుట్టినరోజు)



'పద్మ విభూషణ్ గ్రహీత, బాక్సింగ్ క్రీడాకారిణి మాంగ్టే చుంగ్నేజియంగ్ మేరీ కోమ్ 1983 మార్చి 1న మణిపూర్ రాష్ట్రం కంగథాయ్ ప్రాంతంలో జన్మించారు. అమెచ్యూర్ బాక్సర్, రాజ్యసభ సభ్యురాలిగా వ్యవహరించారు. ఏషియన్ అమెచ్యూర్ బాక్సింగ్ ఛాంపియన్‌గా ఆరుసార్లు విజేతగా నిలిచిన మహిళగా తనదైన గుర్తింపు పొందారు. 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లో 51 కిలోల విభాగంలో పాల్గొని కాంస్య పతకం సాధించారు. ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్‌చే వరల్డ్ నెంబరు 1గా నిలిచారు. పద్మశ్రీ, పద్మభూషణ్ పుర స్కారాలు, ఇతరత్రా అవార్డులు పొందారు.

గృహాలు ప్రారంభం

శింగనమల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సహకారంతో నిదనవాడ గ్రామంలో నిర్మించిన నూతన గృహాలను స్పెయిన్ దేశస్థులు ప్రారంభించారు. శుక్రవారం గ్రామంలో ఆర్డీటీ సంస్థ 17 నూతన గృహాలు నిర్మించింది. ఆర్డీటీ ఏటీఎల్ సుధాకర్, స్పెయిన్ దేశస్థులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ముళబాగిలు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తాలూకా లోని ఆవణి గ్రామంలో నెలకొన్న పురాణ ప్రసిద్ధ కామాక్షిదేవి సమేత ప్రసన్న రామలింగేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం అభిజిత్ ముహూర్తంలో ఘనంగా జరిగింది. ఉదయం మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను వేదపండితుల వేదఘోష నడుమ రథంపై కొలువుదీర్చి మహామంగళారతి తర్వాత రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలనుంచి విచ్చేసిన భక్తులు రథంపై అరటి పండు, దవనం, ఉప్పు, మిరియాలు వేసి మొక్కులు తీర్చు కున్నారు. సేవాకర్తలు పానకం, మజ్జిగ, పెసరపప్పు పంపిణీ చేశారు. అనంతరం సీతమ్మ కొండకు కాలి నడకతో వెళ్లి దర్శనం చేసుకు న్నారు. కాగా భక్తుల సౌలభ్యం కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు కల్పించారు. అవాంఛనీయ సంఘ టనలు చోటు చేసు కోకుండా ఎస్పీ నేతృత్వంలో బందోబస్తు కల్పించారు. పలు చోట్ల సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. మరోవైపు పశువుల పరుషలో పెద్దసంఖ్యలో ఆవులు, ఎద్దుల అమ్మకాలు సాగాయి. ఉత్సవంలో ఆవణి శృంగేరి మఠం అద్వైతానంద భారతి స్వామిజీ ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్, కోలారు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎంపీ మల్లేశ్‌బాబు, మాజీ ఎంపీ మునిస్వామి, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, తహశీల్దార్ వీ గీతా, ఆలయశాఖ అధికారులు పాల్గొన్నారు.



పానకం, మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

రుణాల మంజూరు వేగవంతం చేయండి

బెంగళూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పంట రుణాలతోపాటు రైతులకు అవసరమైన రుణాల మంజూరు వేగవంతం చేయాలని ప్రభుత్వ అదనపు కార్యదర్శి, డెవలెప్‌మెంట్ కమిషనర్ ఉమామహదేవన్ పిలుపునిచ్చారు. 168వ ఎస్‌ఎల్‌బీసీ సమావేశం శుక్రవారం జరిగింది. కెనరాబ్యాంకు ఈడీ భవేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్థికశాఖ కార్యదర్శి డాక్టర్ విశాల్, డిప్యూటీ మేనేజర్ హరిప్రసాద్, నాబార్డు జనరల్ మేనేజర్ కేవీఎస్ఎస్ఎల్‌వీ ప్రసాదరావ్, ఎస్‌ఎల్‌బీసీ సంచాలకులు భాస్కర్ చక్రవర్తితోపాటు అన్నిబ్యాంకుల ముఖ్యులు భాగస్వామ్యులు అయ్యారు. అదనపు ముఖ్యకార్యదర్శి ఉమామహదేవన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాపథకం, ప్రధానమంత్రి సురక్షా బీమా పథకం లబ్ధిదారుల వివరాలు సమగ్రంగా సేకరించాలన్నారు. మూడో త్రైమాసికంలో సీడీ రేషియో సాధ్యంపై బ్యాంకర్లను అభినందించారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులతోపాటు వివిధ సంఘాల ద్వారా రుణాలు పొందేవారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.



సమావేశంలో కెనరా బ్యాంకు ఈడీ భవేంద్రకుమార్ తదితరులు

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన



సైన్స్ ప్రదర్శన ప్రారంభోత్సవంలో ప్రముఖులు

బంగారపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సైన్సు ప్రదర్శనల ద్వారా విద్యార్థులలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు కారణం అవుతాయని జ్యోతిరాయల్ కాన్‌కార్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని లక్ష్మీపురలోని జ్యోతిరాయల్ కాన్‌కార్డ్ పాఠశాలలో నేషనల్ సైన్స్‌డేలో భాగంగా శుక్రవారం సైన్సు ప్రదర్శనను ఏర్పాటు చేశారు. మారుతున్న సాంకేతికతను అలవరుచుకోవడంతోపాటు పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కేవలం పాఠాలకే పరిమితం కాకుండా ప్రాక్టికల్స్‌తో కూడిన ప్రదర్శన ద్వారా ప్రతిభను మెరుగుపెట్టేందుకు వీలవుతుందన్నారు. ప్రత్యేకించి చెత్త నిర్వహణ, సంస్కరణ, పర్యావరణం, మాదిరి వ్యవసాయం, వర్షపు నీటి సేకరణ తదితర వంటి అంశాలపై నమూనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేణుకా, ఉమేర తాజ్, ఉపాధ్యాయులు జయశ్రీ, సరోజా, సురేఖా, శివణ్ణ, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లలో కేసులు పరిష్కరించుకోండి




సన్నాహక సభలో న్యాయాధికారి మహ్మద్‌రోషన్‌షా

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భూవివాదాలు, ఇతర చిన్న వ్యాజ్యాలు ఎన్నో ఏళ్లుగా కోర్టులలో సాగుతున్నాయని వీటిని కక్షిదారులు లోక్ అదాలత్‌లలో పరిష్కరించుకోవాలని న్యాయాధికారి మహ్మద్ రోషన్‌షా అభిప్రాయ పడ్డారు. మార్చి 8న జరిగే లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇందుకు న్యాయవాదులు కూడా చొరవ చూపాలని సూచించారు. పట్టణంలోని కోర్టు సభాంగణంలో లోక్‌అదాలత్‌కు సంబంధించి సన్నాహకసభలో పాల్గొని ఆయన మాట్లాడుతూ రోజురోజుకు కోర్టులలో కేసులు పెరుగుతున్నాయని, దీనికి తోడు న్యాయమూర్తుల కొరత కారణంగా పరిష్కారం కావడంలో జాప్యం జరుగుతోందన్నారు. తీర్పు ఇచ్చేవేళ సైతం కొన్ని కేసులలో వాయిదాలు కోరుతున్నారని, ఇది ఒక్కోసారి విమర్శలకు కారణమైందన్నారు. ఇలా వీటికి పరిష్కారం చెప్పే దిశగా లోక్‌అదాలత్‌లలో కక్షిదారులు రాజీ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో న్యాయవాదులసంఘం అధ్యక్షుడు ఏ నారాయణస్వామి మాట్లాడుతూ లోక్‌అదాలత్ న్యాయాధికారుల సమక్షంలో జరుగుతున్నందున వారి గౌరవాన్ని కాపాడేలే ప్రతి న్యాయవాది కూడా కనీసం ఒక్కోకేసును పరిష్కరించేందుకు చొరవ చూపాలని తద్వారా కేసులు త్వరగా కొలిక్కి వస్తాయన్నారు. ఈ సందర్భంగా సివిల్ న్యాయాధికారి జే పూజా, సీనియర్ న్యాయవాది పాపిరెడ్డి, న్యాయవాదులసంఘం కార్యదర్శి సీజీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి కోసం నిరసన

బాగేపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఎల్లంపల్లి గ్రామంలో రెండు నెలలుగా నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చినా ప్రయోజనం లేకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపెద్ద మునిశామప్ప మాట్లాడుతూ తమ గ్రామంలో రెండు బోరుబావులు ఉన్నాయని అయితే వీటి నుంచి నీటిని శుద్ధీకరణ చేయకనే సరఫరా చేస్తున్నారన్నారు. దీంతో వాడకానికి ఇబ్బందిగా మారిందన్నారు. గ్రామ పంచాయతీ అధికారిని కోరగా ఏవేవో సాకులు చెబుతున్నారని అందుకే కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్నట్టు తెలిపారు. గ్రామ ప్రముఖులు శ్రీనివాస్, నాగరాజు మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు స్వచ్ఛపరచడం లేదన్నారు. నిరసనలో గ్రామస్తులు నాగేశ్, కొండప్ప, వెంకటస్వామి రెడ్డి, వెంకటేశ్, శివప్ప, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయానికి తాళం వేసి గ్రామస్థుల నిరసన

ఏడో వేతన కమిషన్ వర్తింపజేయాలి: రిటైర్డ్ ఉద్యోగులు

బెంగళూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో వివిధశాఖల్లో 30-35ఏళ్లపాటు విధులు నిర్వహించి రిటైరైన వారికి ఏడో వేతన కమిషన్ అమలులో అన్యాయం జరిగిందని రిటైర్డు గవర్న్‌మెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండిపడింది. అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఫ్రీడంపార్కులో శుక్రవారం భారీ నిరసన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలనుంచి వేలాదిమంది రిటైర్డు ఉద్యోగులు చేరుకుని నిరసన తెలిపారు. ఏడో వేతన కమిషన్ అమలు జరిగిన లోటుపాట్లను సరిదిద్ది న్యాయం చేయాలని కోరారు. నిరసనకు మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే మద్దతు తెలిపారు. వేలాదిమంది ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు.



ఫ్రీడం పార్కులో రిటైర్డు ఉద్యోగుల నిరసన

టైలరింగ్‌తో స్వయం ఉపాధి

బాగేపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): టైలరింగ్ ద్వారా స్వయం ఉపాధి సాధ్యమని ధర్మస్థళ గ్రామాభివృద్ధి యోజనాధికారి ప్రవీణ్ అభిప్రాయపడ్డారు. బాగేపల్లి తాలూకాలోని జూలపాళ్య గ్రామపంచాయతీ పరిధి బండకిందపల్లికి చెందిన మహిళలకు ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ జ్ఞాన వికాస కార్యక్రమం ద్వారా మహిళలకు ఉచితంగా టైలరింగ్ తరగతులు నిర్వహిస్తోంది. తర్ఫీదు పూర్తి చేసుకున్న వారికి ప్రమాణపత్రాలను పంపిణీ చేశారు. శిక్షణ పూర్తి చేసుకోవడంపై పలువురు మహిళలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధర్మస్థళ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాణపత్రాలతో మహిళలు

కళ్ళహళ్ళి డెయిరీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

చింతామణి రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కల్లహళ్ళి పాల ఉత్పత్తి దారుల సహకారసంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు గురువారం జరిగాయి. సంఘానికి పాల కమండలి ఏర్పాటయ్యాక ఐదేళ్లకోసారి అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అధ్యక్ష స్థానానికి జి రెడ్డి, ఉపాధ్యక్ష స్థానానికి శివారెడ్డి మాత్రమే నామినేషన్లు వేయడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి సురేశ్ ప్రకటించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించారు. ఈ సందర్భంగా పాలడెయిరీ డైరెక్టర్‌లు బాబణ్ణ, మునిశామరెడ్డి, రామిరెడ్డి, బీ వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్, కేఎస్ కృష్ణారెడ్డి, జయమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షులకు అభినందన

శాసనసభ కలాపాలకు గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న స్పీకర్, సభాపతి

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌ను శాసనసభ ఉభయసభల సమావేశాలకు సాదరంగా ఆహ్వానించారు. శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, పరిషత్ సభాపతి బసవరాజహొరట్టిలు శుక్రవారం రాజ్‌భవన్‌కు వెళ్లారు. ఏడాది ప్రారంభంలో శాసనసభ ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే ఆనవాయితీ ఉంది. అందుకు అనుగుణంగానే మార్చి 3న ఉభయసభల సమావేశంలో పాల్గొనాలని ఆహ్వానించారు. సమావేశాల వివరాలను గవర్నర్‌కు విన్నవించారు.

నేటి నుంచి ద్వితీయ పీయూ పరీక్షలు



శేషాద్రిపురం కళాశాలలో నంబర్లు వేస్తున్న అధికారులు

బెంగళూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ద్వితీయ పీయూ పరీక్షలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం పీయూ బోర్డు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాట్లు చేసింది. మార్చి 20వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్షలు జరుగనున్నాయి. 7.13 లక్షలమంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకున్నారు. ఎటువంటి భయం లేకుండా విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనాలని బోర్డు అధికారులు పిలుపునిచ్చారు.

బుక్ ఫెయిర్‌కు పోటెత్తిన సందర్శకులు



బుక్‌మేళాకు విచ్చేస్తున్న సందర్శకులు


బెంగళూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విధానసౌధ ప్రాంగణంలో తొలిసారి ఏర్పాటు చేసిన బుక్‌ఫెయిర్‌కు సందర్శకులు పోటెత్తారు. గురువారం సాయంత్రం బుక్‌ఫెయిర్ లాంఛనంగా ప్రారంభం కాగా తొలిరోజున శుక్రవారం సందర్శకులకు అవకాశం కల్పించారు. విధానసౌధలో తొలిసారి ఏర్పాటు చేసిన బుక్ మేళాకు నగరంలోని వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చారు. సుమారు 150దాకా స్టాల్స్ ఏర్పాటు చేయడంతో కోరుకున్న పుస్తకాలకోసం ప్రజలు ఎగబడ్డారు. ఉదయం నుంచి నిరంతరంగా సందర్శకులు వస్తున్నారు. స్పీకర్ యూటీ ఖాదర్ స్వయంగా పరిశీలించి సందర్శకులతో మాట్లాడారు.

ఆర్టీసీ ఉద్యోగికి ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగిని సత్కరిస్తున్న ఏటీఎం రవీంద్రారెడ్డి

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఆర్టీసీ విభాగంలో పదేళ్లపాటు పనిచేసిన సుదర్శనంకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) రవీంద్రారెడ్డి, మాజీ వీఆర్‌ఓ జగదీశ్ ఇతర ఉద్యోగులు ఆత్మీయంగా సత్కరించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1607.62	1,586.90
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,091	893
నీటి నిల్వ (టీఎంసీలు)	33.13	8.63



ఏటీఎంలో ఎగిసిపడుతున్న మంటలు

ఏటీఎంలో మంటలు

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని కాలేజీ రోడ్డుఫర్వాజ్ ప్లాజా సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో శుక్రవారం ఉదయం మంటలు చెలరేగాయి. విషయం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. ఏటీఎంలో రూ. 16లక్షలు ఉన్నాయని బ్యాంకు సిబ్బంది అంటున్నారు. ఉదయాన్నే మంటలు ఎగిసిపడుతుండడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడారు. అగ్నిప్రమాదం వల్ల ఇతర దుకాణాలకు పెద్దగా నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నష్టం ఎంత జరిగిందనేది తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

సైన్స్ డేను ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ

తోరణగల్లు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సండూరు పట్టణంలోని ఛత్రపతి శివాజీ విద్యా మందిరంలో శిక్షణ ఇలాఖే జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ సండూరు క్షేత్ర సమన్వయ అధికారులు తాలుకా స్థాయి విజ్ఞాన ప్రయోగ పాఠశాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్‌డే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్ విద్యార్థులు తయారు చేసిన విజ్ఞాన వస్తువులను పరిశీలిస్తూ పరిశీలించి వారి ప్రతిభను ప్రశంసించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను, విజ్ఞానాన్ని గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులు వారి అడుగుతున్న ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనిల్ కుమార్, శిక్షణాధికారి ఐఆర్ అక్కి, జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ అధికారులు, విద్యామందిర్ పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్దేహాళ్ వాసి.. కర్ణాటకలో మృతి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన యువకుడు శివశంకర్ (28) కర్ణాటకలోని తోరణగల్లు వద్ద ఓ కర్మాగారంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన అంజలి, మల్లేష్ దంపతుల కుమారుడు శివశంకర్ జిందాల్ కర్మాగారంలో అకౌంట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా అతను గురువారం కర్మాగారంలోని నీటి ట్యాంక్‌లో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందినట్లు ఫ్యాక్టరీలోని వారు తెలిపారు. అయితే తమ కుమారుడు ప్రమాదవశాత్తు మరణించలేదని, ఎవరో కావాలనే నీటిలోకి తోసేసి చంపేశారని తల్లిదండ్రులు ఆరోపించారు. శివశంకర్‌కు ఏడాది క్రితమే డీ.హీరేహాళ్ మండలం బాదనహాళ్ గ్రామానికి చెందిన లక్ష్మీతో వివాహమైంది. మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామానికి తీసుకురావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై తోరణగల్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు.



విజేత రైతుకు రూ.2లక్షలు అందిస్తున్న మంత్రి జమీర్



ప్రదర్శనలో ఎడ్లబండితో రైతు

ఉత్సవం..ఉత్సాహం..!

● హంపిలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు


హోస్పేట/ కంప్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): హంపి ఉత్సవాల సందర్భంగా సంబరాలు జోరందుకున్నాయి. గాయత్రి వేదిక విరుపాక్షేశ్వర స్వామి వేదిక, ఎదురు బసవన్న, శాశ్వేకాళ్ గణప్ప వేదికల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శుక్రవారం ఉదయం కమలాపురం చెరువులో మంత్రులు జమీర్ అహ్మద్, బోటు క్రీడలను ప్రారంభించారు. బోటింగ్‌లో ఆయ న కూడా చెరువులో ఉల్లాసంగా ఎమ్మెల్యే గవియప్ప అధికారులు తదితరులు బోటింగ్ చేస్తూ సంబరాలు చేపట్టుకున్నారు. అనంతరం ఎద్దుల, పశువుల ప్రదర్శన పూర్తిగా ఆకట్టుకుంది. 15 జంటల ఎద్దులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. మంత్రి జమీర్ అహ్మద్ రూ. 2.50 లక్షల బహుమతిని మొదటి ప్రైజ్ వచ్చిన మంజునాథకు అందించారు. ఉదయం విరుపాక్షేశ్వర ఆలయం ముందు ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. అలాగే కమలాపురం భువనేశ్వర హోటల్ వద్ద బైస్కై హెలికాప్టర్ కూడా ఆకట్టుకుంది. హంపి విరుపాక్షేశ్వరస్వామి ఆలయ గోపురాన్ని పుష్పాలతో ప్రదర్శించారు. అలాగే విజయనగర సంస్థాపకులు అక్కబుక్క రాయలు, శ్రీకృష్ణదేవరాయలు, కురువత్తి బసవన్న, రాతిరథం, కూడా ఆకట్టుకున్నారు. అంతకుముందు వస్తుప్రదర్శనలో గ్రామాల్లో బోరుబావుల ద్వారా నీరు మళ్లించే దృశ్యాలు కూడా ఆకట్టుకున్నాయి.




ఆకట్టుకుంటున్న ముగ్గులు



ప్రదర్శనలో అశోక చక్రం నమూనా



రాతిరథం



బసవన్న

నిధుల దుర్వినియోగంపై బీజేపీ నిరసన

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధికి ఉద్దేశించిన ఎస్‌సీపీ, టీఎస్‌పీ నిధులను దుర్వినియోగం చేయడాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శుక్రవారం బళ్లారి నగరంలోని గడిగి చన్నప్ప సర్కిల్లో భారీ నిరసన నిర్వహించింది. నగరంలోని దుర్గమ్మ ఆలయం నుంచి శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు చలవాదీ నారాయణస్వామి నేతృత్వంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. గడిగిచన్నప్ప సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాన వీదులగుండా ర్యాలీగా వెళ్లి డీసీ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి అందరికీ ఉచితమైన ఐదు హామీలను కాంగ్రెస్ ప్రకటించిందని, అయితే నిధులు లేవన్న సాకుతో ఎస్సీ ఎస్టీల సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారన్నారు. రూల్ నెం. 7ను సీఎం దుర్వినియోగం చేస్తోందన్నారు. 2024-25 బడ్జెట్‌లో ఎస్సీ, టీఎస్పీ ప్రజలకు రూ.39కోట్లు కేటాయించారు. రూ.20వేల కోట్లు మాత్రమే ఖర్చయింది. నియమం 7సీ ప్రకారం ఒకనిర్దిష్ట సంఘానికి కేటాయించిన నిధులను ఆ సమాజ అభివృద్ధికి ఉపయోగించాలపి డిమాండ్ చేశారు. చలవాది నారాయణస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కేటాయించిన రూ. 25000 కోట్లను హామీల కోసం ఉపయోగించుకుంది. ఇప్పుడు బడ్జెట్‌లోని రూ.15,000 కోట్లను ఐదు హామీల కోసం ఉపయోగించాలని యోచిస్తోంది. గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి మాజీఎంపీ ఫక్కీరప్ప, మాజీ ఎమ్మెల్యే సంపంగి, శివనగౌడ,సోమలింగప్ప, పార్టీ రాష్ట్రకార్యదర్శి శరణు తరికెరి,జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు,డాక్టర్ మహిపాల్, రామలింగప్ప, గురులింగనగౌడ, మల్లనగౌడ,మునిసిపాలిటీ బీజేపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

బర్డ్ ఫ్లూపై ఆందోళన వద్దు : కలెక్టర్

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బర్డ్‌ఫ్లూ కేసులు నమోదైన నేపథ్యంలో జిల్లాలో విస్తృత జాగ్రత్తలు తీసుకున్నామనీ ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. జిల్లాపంచాయతీ, జిల్లాయంత్రాంగం, ఆరోగ్యకుటుంబ సంక్షేమ శాఖ, పశుసంవర్ధక శాఖ, బీఎంఆర్‌సీ మున్సిపల్ కార్పోరేషన్, జిల్లా సర్వే యూనిట్, సమాచార విద్య, కమ్యూనికేషన్ శాఖల సహకారంతో శుక్రవారం జిల్లా కలెక్టర్ హాల్లో ఏవీయస్ ఇన్‌ఫ్లూ ఎంజాపై నిర్వహించిన అంతర్ విభాగ సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బర్డ్‌ఫ్లూ వైరస్ పక్షులకు వస్తుందని, ఇది విసర్జన, శ్వాసకోశ స్రావాలు సోకిన పక్షుల ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఈ ఇన్ఫెక్షన్ ఎక్కువగా కోళ్లలో వస్తుందని, కోళ్లను కోయడంలో పాల్గొనే పెద్దవారిలో సంభవిస్తుందన్నారు. అవగాహన కల్పించడం ద్వారా సంక్రమణ వ్యాప్తిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పక్షులు అసాధారణంగా చనిపోవడం గమనించినట్లయితే పశువైద్యాధికారులకు తెలియజేయాలన్నారు. అనారోగ్య లేదా ప్రమాదవశత్తు చనిపోయిన పక్షులను పట్టుకోకూడదు. ఇంట్లో వ్యాధి సోకిన పక్షుల ఈకలను చేతితో తాకరాదని, బర్డ్‌ఫ్లూ అధికంగా ఉన్నప్రాంతాల్లో నివసిస్తుంటే జీవించి ఉన్నపక్షులను మాంసం కోసం అమ్మే లేదా వధించే ప్రదేశాలకు వెళ్లరాదన్నారు. అనంతరం బర్డ్‌ఫ్లూపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు.




పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పక్షులను తాకిన తర్వాత సబ్బు నీటితో చేతులు కడుక్కోవాలి.కోళ్లను పట్టుకునేటప్పుడు నోటిముక్కుకు మందపాటి మాస్క్ ధరించాలి. కోళ్లఫారాల్లో పనిచేసే కార్మికులకు వ్యక్తిగత సంరక్షణ గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంగా జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డాక్టర్ రమేశ్‌బాబు, జిల్లాసర్జన్ బసారెడ్డి, డాక్టర మరియంబి, పశుసంవర్ధక ,పశువైద్య సేవల శాఖ, వినోద్‌కుమార్, బిమ్స్ మైక్రోబయోలజీ విభాగం, మెడికల్ సూపరింటెండెంట్ డా. ఇందుమతి,జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డా.అబ్దుల్లా, వైద్య అధికారులు పాల్గొన్నారు.

తుంగభద్ర శిలాఫలకానికి మంత్రి పూజలు

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి శంకుస్థాపన జరిగి 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఉదయం జిల్లాఇన్‌ఛార్జి మంత్రి జమీర్ అహమ్మద్ శంకుస్థాపన శిలాఫలానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1945ఫిబ్రవరి 28న తేది నందు తుంగభద్ర జలాశయానికి శంకుస్థాపన చేపట్టారు. ఆయనతో పాటు హొసపేట ఎమ్మెల్యే గవియప్ప, మహమ్మద్ ఇమామ్ నియాజీ, హొసపేట నగరాభివృద్ధి ప్రాదికారం జలాశయానికి పూజలు చేపట్టారు. ఈసందర్భంగా తుంగభద్ర జలాశయం అధికారులు, తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షులు పురుషోత్తమగౌడ, ఉపాధ్యక్షులు వీరనగౌడ శ్రీధరగడ్డ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మంత్రి జమీర్, ఎమ్మెల్యే గవియప్ప

ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోండి

● మేయర్ ముల్లంగి నందీశ్ కుమార్



మాట్లాడుతున్న మేయర్ ముల్లంగి నందీశ్ కుమార్

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరంలో ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని మహానగర పాలిక సంస్థ మేయర్ ముల్లంగి నందీశ్ సూచించారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా ఆయుష్ శాఖ, మున్సిపల్ కార్పోరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పోరేషన్ ఆడిటోరియంలో పౌర కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య తనిఖీ చికిత్స శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈసందర్భంగా జిల్లా ఆయుష్ శాఖ అధికారిణి డాక్టర్ సరళాదేవి మాట్లాడుతూ జిల్లాలోని పౌర సేవకులు ఆయుర్వేద మందులను ఉపయోగించడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఆయుర్వేదంలో రోగనిరోధక శక్తిని పెంచే మందులు విశేషంగా ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో పౌరకార్మికులకు ఉచిత తనిఖీ చికిత్స శిబిరంలో సుమారు 288 మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా బళ్లారి నగర ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ ఆఫీసర్ మునాఫ్ పటేల్, ఆయుష్ వైద్యులు డాక్టర్ తిప్పేస్వామి, డాక్టర్ రాఘవేంద్ర ఆచారి, డాక్టర్ విజయేంద్రచార్, డాక్టర్ పణీంద్ర, డాక్టర్ శ్రీగురు మురుగేష్, డాక్టర్ కల్యాణి, డాక్టర్ రాజేశ్వరీ, డాక్టర్ అరుంధతి పాల్గొన్నారు.

యువత వైజ్ఞానిక ఆలోచనలు పెంచుకోవాలి

● ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): భారత దేశం ఉత్తమ భవిష్యత్తు కోసం, యువతలో వైజ్ఞానిక లక్ష్యాలను పెంపొందించాలని డాక్టర్ మహ్మద్ ముస్తాఫా పేర్కొన్నారు. నగరంలోని విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం జీవ విజ్ఞాన సభాంగంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జాతీయ విజ్ఞాన దినోత్సవం కార్యక్రమంలో భాగంగా 'విజ్ఞానం నవీన్యత ప్రపంచీకరణ న్యాయకత్వం భారతీయ యువకుల సబలీకరణ " అనే విషయంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ మొహ్మద్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నూతన అవిష్కారాలు, విజ్ఞాన నగరంలో కొత్త కొత్త మైలురాళ్ళ ద్వారా గుర్తించబడుతాయని, సైన్స్ అండ్ టెక్నాలలో విద్యార్థులు ఎక్కువగా పాల్గొనాలన్నారు. అనంతరం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎస్.ఎన్.రుద్రేష్ మాట్లాడుతూ, విద్యార్థులు చదవుకునే సమయంలో విజ్ఞానపరమైన మనోభావాలు కలిగి ఉండాలన్నారు. విజ్ఞానం పరంపరను ఒక సార్వత్రిక అభియాన కార్యక్రమంగా ప్రపంచం పరిగణించిందన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం, ప్రొఫెసర్ సి.వి.రామన్ లాంటి విజ్ఞానులు మాదిరిగా విద్యార్థులు తయారు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం. మునిరాజు యువకులు విజ్ఞానంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం జీవ విజ్ఞానం విభాగం డీన్ ప్రొఫెసర్ శశికాంత్ మజగి, ప్రొఫెసర్ హనుమేష్ వైద్యలతో విశ్వవిద్యాలయం ఉపన్యాసకులు, పరిశోదకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోసూరు జోన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

గెజిటెడ్ అధికారుల సమన్వయ సమావేశం

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయలో గెజిటెడ్ అధికారుల సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఎస్.దినేశ్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కవిత, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, జిల్లా అటవీ అధికారి బాగన్ జగదీశ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం

హోసూరు(కృష్ణగిరి) ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): హోసూరు ములైనగర్ ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్ వార్షికోత్సవం ఉత్సాహంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. ప్రిన్సిపాల్ గాంధీ అధ్యక్షత వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అసోషియేషన్ ప్రెసిడెంట్ మహేశ్ బాబు అందరికీ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వై.ప్రకాశ్, హోసూరు మేయర్ సత్య, హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఇక్రమ్, డీఎంకే నిర్వాహకులు మురుగన్, శంకరనారాయణ, అరుళరాసన్, సెల్వం, బాస్కర్, రాజేంద్రన్, ఇతర నిర్వాహకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రశంసాపత్రాలు అందజేశారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

నేడు ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

● సంబరాలకు అభిమానులు కదలి రావాలి : ఎమ్మెల్యే ప్రకాశ్



హోసూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే రాష్ట్ర అధ్యక్షుడు స్టాలిన్ పుట్టినరోజు వేడుకలు శనివారం జరగనున్నాయి. హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్ మాట్లాడుతూ హోసూరు అభివృద్ధికి సీఎం నిధులు మంజూరు చేశారన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు పనులు 60-70 శాతం ముగుస్తూ వస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా రూ.32 కోట్ల వ్యయంతో కొత్త బస్టాండు నిలయం, హోసూరు కార్పొరేషన్ స్థాయికి తగ్గటుగా రాయకోట రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టామని వేగంగా పనులు ముగింపుదశకు వచ్చాయన్నారు. బాగలూరులో రూ.1 కోటి వ్యయంతో బస్టాండు, 2వే వేల ఎకరాల్లో విమానాశ్రయం ప్రకటించారన్నారు. తమిళనాడులో డీఎంకే హయాంలో మాత్రమే అభివృద్ధి జరిగిందన్నారు. డీఎంకే ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు తమిళనాడులో అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత డీఎంకే పార్టీకే దక్కుతుందన్నారు. సీఎం పుట్టినరోజును ఘనంగా జరుపుకోనున్నట్లు తెలిపారు.

నాయకత్వ లక్షణాల పెంపుపై సమావేశం

హోసూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎస్‌డీపీఐ పార్టీ కృష్ణగిరి పశ్చిమ జిల్లా విభాగం ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాల పెంపు అనే అంశంపై హోసూరులో సదస్సు జరిగింది. సమర్థులైన నాయకులను తయారు చేయాలనే లక్ష్యంతో శిబిరాన్ని నిర్వహించారు. ఎస్‌డీపీఐ జిల్లా ప్రధానాధికారి షబివుల్లా అధ్యక్షత వహించి స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమం జిల్లా కార్యదర్శి జావిద్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి అజాద్, కృష్ణగిరి తూర్పు జిల్లా అధ్యక్షుడు అస్గర్ అలీ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై నాయకత్వ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఎస్‌డీపీఐ కృష్ణగిరి పశ్చిమ జిల్లా కోశాధికారి కలీం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇమ్రాన్, తళి నియోజకవర్గ అధ్యక్షుడు పరూక్ అహ్మద్, హోసూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఇంతియాజ్, వేపనపల్లి పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షుడు సమీర్‌తోపాటు వివిధ ప్రాంతాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

అన్నాడీఎంకే విజయాలపై ఇంటింటి ప్రచారం

హోసూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శాసనసభ నియోజకవర్గం ఎన్నికలకు ఇప్పటినుంచే సమాయత్తం అయ్యేలా ఇరవయ్యో వార్డు పరిధిలో అన్నాడీఎంకే విజయాలను తెలిపేలా కార్యకర్తలు కరపత్రాలతో ప్రచారం చేశారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా పార్టీ కార్యదర్శి మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి కూడా పాల్గొన్నారు. ఎడప్పాడి పళనిస్వామి తన 4 సంవత్సరాల పాలనలో సాధించిన విజయాలను వివరించారు. కార్పొరేషన్ పరిధిలోని మూకొండపల్లి ప్రాంతంలో జాతీయరహదారిపై వ్యాపారులు పాల్గొన్నారు. చిన్న తరహా పరిశ్రమలు, గృహిణులు సాధించిన విజయాల జాబితాతో కూడిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగదీశ్, మండల కమిటీ అధ్యక్షుడు జయప్రకాశ్, కృష్ణగిరి పశ్చిమ జిల్లా ఉప కార్యదర్శి మదన్, ప్రజాప్రతినిధులు పార్టీ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అన్నాడీఎంకే కార్యకర్తలు